పరుపుల గోదాంలో అగ్ని ప్రమాదం

టాటానగర్‌లో కాటన్ పరుపుల కంపెనీలో చెలరేగిన మంటలు

మైలార్‌దేవ్‌పల్లి, ఏప్రిల్ 1: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ టాటానగర్‌లో ప్రమాదవశాత్తు కాటన్ పరుపుల గోదాములో సోమవారం ఉదయం 10 గంటలకు అగ్ని ప్రమాదం జరిగింది. అగ్నిప్రమాదం కారణంగా మంటలు చెలరేగడంతో పొగ వ్యాపించి పూర్తిగా కమ్ముకుంది. ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే రెండు ఫైర్ ఇంజన్లు సంఘటన స్థలానికి చేరుకోని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. సంఘటన స్థలాన్ని జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి శ్రీనివాస్ పరిశీలించి సిబ్బందితో కలిసి మంటలను ఆర్పివేశారు. పరిశ్రమలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ముడి సరుకుతోపాటు తయారు చేసిన కాటన్ బెడ్లు అగ్నికి ఆహుతయ్యాయని తెలిసింది. ఘటనపై మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ మధు తెలిపారు.

బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్

రాజేంద్రనగర్ కోర్టు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా శంషాబాద్ మండలం చిన్నగోల్కొండ గ్రామానికి చెందిన రామగల్ల వెంకటేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన వెంకటేశ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అప్పగించిన పదవికి న్యాయం చేస్తానని తెలిపారు. తనకు పదవి అప్పగించిన కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

– శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 1

భారీగా ఆస్తిపన్ను వసూలు.. 'ఎర్లీబర్డ్' షురూ..

- రాజేంద్రనగర్‌లో 98.87 శాతం
- బండ్లగూడలో 74 శాతం ఆస్తి పన్ను వసూలు

బండ్లగూడ, ఏప్రిల్ 1: ఆస్తిపన్ను వసూలులో జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్‌లలో 98.87 శాతం ఆస్తి పన్నును వసూలు చేశారు. 2023-2024 ఆర్థిక సంవత్సరం ఆదివారంతో ముగియడంతో అధికారులు సిబ్బంది అర్ధరాత్రి వరకు డిమాండ్‌ను చేరుకునేందుకు ప్రయత్నించారు. డిమాండ్ రూ.52కోట్లు ఉండగా రూ.51కోట్ల87లక్షల పన్ను వసూలు అయినట్లు ఉప కమిషనర్ రవికుమార్ తెలిపారు. మొండి బాకాయి వసూలుకు సహకరించిన వారందరినీ అభినందనలు తెలిపారు.

బండ్లగూడలో 74శాతం..

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 2023-2024 ఆర్థిక సంవత్సరానికి రూ.27 కోట్ల డిమాండ్ ఉండగా, అందులో రూ. 20 కోట్ల ఆస్తి పన్ను వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు.

రాజేంద్రనగర్ జీహెచ్‌ఎంసీ కార్యాలయం

ప్రారంభమైన ఎర్లీ బర్డ్..

ముందస్తు ఆస్తి పన్ను చెల్లింపుదారులకు ప్రభుత్వం ఎర్లీబర్డ్ పథకన్ని ప్రవేశపెట్టింది. పథకంలో ఏప్రిల్ 1 నుంచి 30 తేదీ వరకు పన్నులో 5శాతం రిబేట్‌తో తమ ఆస్తి పన్ను చెల్లించవచ్చని డీసీ రవికుమార్ తెలిపారు. ఆస్తి పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పన్నును చెలించాలని ఆయన కోరారు.

యూసుఫ్‌గూడలో రూ. 33.75 కోట్ల వసూలు

- 19వ సర్కిల్‌లో లక్ష్యాన్ని దాటిన పన్ను

జూబ్లీహిల్స్ : యూసుఫ్‌గూడ సర్కిల్‌లో రూ. 33.75 కోట్ల ఆస్తిపన్ను వసూలు చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరం వసూళ్లలో జీహెచ్‌ఎంసీ 19వ సర్కిల్ లక్ష్యాన్ని అధిగమించింది. నెలరోజుల పాటు స్పెషల డ్రైవ్ చేపట్టి నిర్దేశిత రూ.33.73 కోట్ల లక్ష్యానికి గానూ రూ.33.75 కోట్ల పన్ను వసూలు చేశారు. పన్ను చెల్లింపునకు 2022-23 వరకు బకాయి ఒకేసారి చెల్లించినవారికి 90 శాతం వడ్డీ మాఫీచేస్తూ జీహెచ్‌ఎంసీ వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ఆఫర్‌ను అందించిన విషయం తెలిసిందే. అయితే జీహెచ్‌ఎంసీ అధికారులు తీవ్రంగా కృషి చేశారు. డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్ ఆధ్వర్యంలో ఏఎంసీ కమల్, ఇన్‌చార్జి ఏఎంసీ బాల్‌రాజ్ ఆధ్వర్యంలో బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లతో కూడిన జీహెచ్‌ఎంసీ ప్రత్యేక బృందాలు ముమ్మరంగా ఆస్తి పన్ను వసూళ్లు చేపట్టారు. ఆస్తిపన్ను వసూలుకు కృషిచేసిన అధికారులకు, సిబ్బందికి అభినందనలు తెలిపారు.

యూసుఫ్‌గూడలో ఆస్తిపన్ను చెక్కును స్వీకరిస్తున్న డీసీ సేవా ఇస్లావత్, ఏఎంసీలు

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

- అదనపు కలెక్టర్, ఆర్వో హేమంత్ కేశవ్‌పాటిల్

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 1: లోక్‌సభ ఎన్నికల విధుల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్, సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ హేమంత్ కేశవ్‌పాటిల్ అన్నారు. సోమవారం షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో పోలింగ్ ఆఫీసర్స్, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్స్‌కు నిర్వహించిన తొలి విడత శిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్స్ ఎన్నికల విధులపై అధికారులకు అవగాహన కల్పించారు. విధుల్లో అలసత్వం ప్రదర్శించ వద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఆర్వో, యూసుఫ్‌గూడ సర్కిల్ డీసీ సేవా ఇస్లావత్, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించి ఏఆర్వో, డీసీ సేవా ఇస్లావత్‌కు సూచనలు చేస్తున్న ఆర్వో హేమంత్ కేశవ్ పాటిల్

ఆటిజాన్ని ప్రారంభంలోనే పసిగట్టాలి

- ఐఐపీహెచ్ డైరెక్టర్ డాక్టర్ మధుబాల

సమావేశంలో పాల్గొన్న ఐఐపీహెచ్ డైరెక్టర్ డాక్టర్ మధుబాల, తదితరులు

వ్యవసాయ యూనివర్సిటీ, ఏప్రిల్ 1: మందబుద్ధి గల చిన్నారులను తొలిదశలోనే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకుంటే పెద్ద ప్రమాదమేమీ కాదని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్(ఐఐపీహెచ్) డైరెక్టర్ డాక్టర్ మధుబాల రెంటాల అన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ఐఐపీహెచ్ సమావేశపు మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మానసిక ఎదుగుదల లోపం కారణంగా చాలామంది పిల్లలు అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. మంగళవారం ప్రపంచ మంద బుద్ధి(ఆటిజం) నివారణ దినం సందర్భంగా వయస్సుకు తగ్గట్టు పిల్లల్లో రావాల్సిన మానసిక ఎదుగుదల ఉండాలని అన్నారు. ఆటిజాన్ని ప్రారంభంలోనే గుర్తించాలని, నిర్లక్ష్యం చేస్తే జీవితాంతం నాడీ సంబంధిత రుగ్మతగా(న్యూరోలాజికల్ డిజార్డర్)తో బాధపడాల్సి ఉంటుందని చెప్పారు. ఈ వ్యాధి అరుదైనదని 100 పిల్లల్లో ఒకరికి ఉంటుందని వివరించారు. నివారించడంలోనే అనేక సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది. మూడేండ్లు నిండకముందే లక్షణాలు కనిపిస్తాయన్నారు. లింగ భేదంతో సంబంధం లేకుండా, తరచుగా మూర్ఛ, నిరాశ, ఆందోళన హైపరాక్టివిటీ డిజార్డర్ వంటి రుగ్మతలను కలిగి ఉంటాయన్నారు. పెరుగుతున్న టెక్నాలజీతో అనేక మందులు సైతం వచ్చాయని వెల్లడించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజన్‌శుక్లా, రోహిత్ , జననిచారి, మరినా, కిరణ్, యూనిసెఫ్ సీఎఫ్ఓ జెలలేమా, ఫెర్నాండేజ్ దవాఖాన ప్రతినిధి తేజో ప్రతాఫ్, దేదీప్యా, అంకురా ఆసుపత్రి సుగుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు .

వధూవరులను ఆశీర్వదించిన కేటీఆర్

వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే సబితారెడ్డి, తదితరులు

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 1: రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ మనుమరాలు వైష్ణవి-నిఖిల్‌గౌడ్ వివాహం ఆదివారం రాత్రి శంషాబాద్ పట్టణంలోని జేడీ కన్వెషన్ హాల్‌లో వైభవంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, ప్రకాశ్‌గౌడ్, నేతలు కార్తీక్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కె.చంద్రారెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మారెడ్డి, వైస్ చైర్మన్ గోపాల్‌యాదవ్, ఎంపీపీ జయమ్మ, జడ్పీటీసీ తన్వీరాజుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని నూతన వధువరులను ఆశీర్వదించారు.

నగరాన్ని స్వచ్ఛతగా ఉంచుదాం..

బన్సీలాల్‌పేట్, ఏప్రిల్ 1 : ఇంట్లో చెత్తను రోడ్లపై వేయకూడదని, ఇంటింటికీ వచ్చి చెత్త సేకరించే రిక్షా కార్మికులకే ఇవ్వాలని జీహెచ్‌ఎంసీయూసీడీ అధికారి ఎన్. నర్సింహ అన్నారు. ఈ మేరకు 'స్వచ్ఛత వైపు ఒక అడుగు' కార్యక్రమంలో భాగంగా సోమవారం భోలక్‌పూర్ కృష్ణా నగర్‌లో ఇంటింటికీ వెళ్లి స్థానికులతో మాట్లాడారు. చెత్త కుండీలు లేని నగరంగా హైదరాబాద్‌ను అభివృద్ధి పరచి, దేశంలోనే బెస్ట్ సిటీ అవార్డు అందుకున్న ఘనత మనదేనని ఆయన తెలిపారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. అనంతరం స్థానికులచే ప్రతిజ్ఞ చేయించారు.

6న గద్దర్ 'పాటపై తూటా' సభ

ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న సూర్యకిరణ్, పాశం యాదగిరి తదితరులు

ఖైరతాబాద్, ఏప్రిల్ 1: ప్రజాగాయకుడు, దివంగత గద్దర్‌పై కాల్పులు జరిగి 27 ఏండ్లు అయిన సందర్భంగా గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 6న బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సాయంత్రం 6 గంటల నుంచి 'పాటపై తూటా' పేరుతో సభ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు, గద్దర్ తనయుడు సూర్యకిరణ్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మీడియా సమావేశంలో సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ సంగంరెడ్డి పృథ్వీరాజ్‌యాదవ్, డాక్టర్ జిలుకర శ్రీనివాస్‌తో కలిసి సభకు సంబంధించిన ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. సూర్యకిరణ్ మాట్లాడుతూ.. ఈ సభకు ముఖ్యఅతిథులుగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, ప్రొఫెసర్ కంచె ఐలయ్య, జస్టిస్ చంద్రకుమార్, రాజకీయ విశ్లేషకులు డాక్టర్ పరకాల ప్రభాకర్, ఆంధ్రజ్యోతి ఎడిటర్ డాక్టర్ కె.శ్రీనివాస్, సీనియర్ అంబేద్కరిస్ట్ జేబీ రాజు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ప్రజాగాయకురాలు విమలక్క, ప్రజాకవి జయరాజు, ఎంవీ ఫౌండేషన్ అధ్యక్షుడు ఆర్.వెంకట్‌రెడ్డితో పాటు గద్దర్ అభిమాన సంఘం నాయకులు సీఎల్ యాదగిరి, తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు డి.కొండారెడ్డి, సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.సాగర్, ఎన్.బాలమల్లేశ్ హాజరవుతున్నారని తెలిపారు.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు

కంటోన్మెంట్, ఏప్రిల్ 1: వేసవిని దృష్టిలో ఉంచుకుని ఒకటో వార్డులో నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నట్లు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం న్యూ బోయిన్‌పల్లి కడక్ పురాలోని మజీద్ హోమర్ వద్ద బోర్‌వెల్ రిపేర్ కావడంతో జక్కుల మహేశ్వర్‌రెడ్డి బోర్‌వెల్ సమస్యను పరిష్కరించారు. స్థానికులు నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న విషయం తన దృష్టికి రావడంతో వెంటనే స్పందించిన జక్కుల తన టీమ్‌ను ఆ ప్రాంతానికి పంపించి దగ్గరుండి పనులు పూర్తి చేయించారు. నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా ముందుకు సాగుతున్నామన్నారు.

సెక్యూరిటీ గార్డ్స్ అప్రమత్తంగా ఉండాలి

నారాయణగూడలో సెక్యూరిటీగార్డులకు అవగాహన కల్పిస్తున్న సీఐ చంద్రశేఖర్

హిమాయత్‌నగర్, ఏప్రిల్ 1: అపార్ట్‌మెంట్లలో విధులు నిర్వహించే సెక్యూరిటీ గార్డ్స్ అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని నారాయణగూడ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ యు. చంద్రశేఖర్ సూచించారు. సోమవారం పీఎస్ పరిధిలో ఉన్న అపార్ట్‌మెంట్లకు ఉన్న సెక్యూరిటీగార్డులతో సమావేశమై భద్రతాపర మైన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ చంద్రశేఖర్, అడ్మిన్ ఎస్సై నరేశ్‌కుమార్ మాట్లాడుతూ.. అపార్ట్‌మెంట్లలోకి వచ్చే గుర్తుతెలియని వ్యక్తులపై ప్రత్యేక నిఘా పెట్టడంతోపాటు రిజిస్టర్‌లో సమగ్రమైన వివరాలను నమోదు చేయాలన్నారు. అనుమానాస్పదగా ఎవరైనా సంచరిస్తే 100, స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

బాబుల్‌రెడ్డినగర్‌లో రోడ్లకు ప్యాచ్‌వర్క్

బాబుల్‌రెడ్డినగర్‌లో ప్యాచ్‌వర్క్ పనులను పరిశీలిస్తున్న ప్రతినిధులు

మైలార్‌దేవ్‌పల్లి, ఏప్రిల్ 1: కొన్ని రోజులుగా గోతులమయమైన రోడ్లకు జీహెచ్‌ఎంసీ అధికారులు ప్యాచ్‌వర్క్ పనులను ప్రారంభించారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని బాబుల్‌రెడ్డినగర్‌లో గతులమయమైన రోడ్లతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానిక యువకులు 10రోజుల క్రితం జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. దీంతో ఆయన స్పందించి, గతుకుల రోడ్లను పూడ్చేందుకు బీటీ మిశ్రమంతో ప్యాచ్‌వర్క్ పనులను చేపడుతున్నారు. సోమవారం పోచమ్మ ఆలయం నుంచి హనుమాన్ ఆలయం వరకు ఉన్న గుంతలకు సిబ్బంది ప్యాచ్‌వర్క్ చేయించారు. ఈ పనులను స్థానిక యువకులు పర్యవేక్షించి పనులు చేయించుకున్నారు. సరైన రోడ్ల లేకపోవడంతో వాహనాదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులకు గురైయ్యారన్నారు. అనేక మంది ప్రమాదాలకు గురై దవాఖానల్లో చికిత్స పొందారన్నారు. అధికారులు స్పందించి ప్యాచ్‌వర్క్ పనులు నిర్వహించడంతో వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏర్వ కుమారస్వామి, రమేశ్‌రెడ్డి, శేఖర్, రాజేశ్, శివ, మల్లేశ్, ప్రవీణ్, సన్నీ, కె.శ్రీను, తదితరులు ఉన్నారు.

సుచిర్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్

బంజారాహిల్స్,ఏప్రిల్ 1: ఎర్రమంజిల్‌లోని మెర్క్యూర్ హోటల్‌లో సుచిర్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల్లోని అనాథ ముస్లిం బాలలకు, ఇఫ్తార్ విందుతో పాటు కొత్త బట్టలు పంపిణీ చేశామని సుచిర్ ఇండియా ఫౌండేషన్ చైర్మన్ లయన్ కిరణ్ తెలిపారు. కార్యక్రమంలో పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు.

దవాఖానలో గొలుసు చోరీ

- బాధితురాలి ఫిర్యాదుతో కేసు

బంజారాహిల్స్, ఏప్రిల్ 1: కూతురిని దవాఖానకు తీసుకువెళ్లిన సమయంలో బ్యాగులో పెట్టిన బంగారం మాయమైన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఫిలింనగర్‌లోని సిద్ధప్ప హోటల్ సమీపంలో నివాసం ఉంటున్న జె.అశ్విని తన కుమార్తెకు జ్వరం రావడంతో మార్చి 28న షేక్‌పేటలోని కాండీ హాస్పిటల్‌కు తీసుకు వెళ్లగా అడ్మిట్ చేసుకున్నారు. ఆ సమయంలో తన 3తులాల బంగారు గొలుసును బ్యాగ్‌లో పెట్టుకున్న అశ్విని అదే నెల 30న కుమార్తెను డిశ్చార్జ్ చేయడంతో ఇంటికి వచ్చారు. ఇంటికి వచ్చి బ్యాగులో చూడగా గొలుసు కనిపించలేదు. దవాఖానలో తాను వాష్‌రూమ్‌కు వెళ్లినప్పుడు గొలుసు చోరీ అయిందని బాధితురాలు సోమవారం ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పాల ట్రేల చోరీకి యత్నించిన వ్యక్తి అరెస్టు

ఖైరతాబాద్, ఏప్రిల్ 1: షాపు ముందు ఉన్న పాల ట్రేలు ఎత్తుకెళ్లేందుకు యత్నించిన ఓ వ్యక్తి పోలీసులు అరెస్టు చేశారు. పంజాగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ద్వారకాపురికాలనీకి చెందిన వెంకటేశ్ పాల వ్యాపారి. సోమవారం షాపు ముందు ఉంచిన మూడు ట్రేలను గుర్తుతెలియని వ్యక్తి ఎత్తుకెళ్లేందుకు యత్నించాడు. స్థానికులు గుర్తించి అతన్ని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. విచారణలో బాలానగర్ రాజుకాలనీకి చెందిన దత్తు కుమార్(29)గా గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

బేగంపేట్, ఏప్రిల్ 1: వింత శబ్దాలతో శబ్ద కాలుష్యానికి పాల్పడుతున్న వాహనదారులపై ఉత్తర మండలం ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝులిపించారు. నెల రోజులుగా నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు నేతృత్వంలో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి అధికంగా సౌండ్ చేసే ద్విచక్ర వాహనదారుల వాహనాలను సీజ్ చేసి సైలెన్సర్‌లను స్వాధీనం చేసుకున్నారు. తొలగించిన సైలెన్సర్‌లను సోమవారం బేగంపేట్‌లోని ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్‌లో పోలీసు అధికారులు ధ్వంసం చేశారు. సుమారు వెయ్యి సైలెన్సర్‌లను ధ్వంసం చేసినట్టు ఏసీపీ శంకర్‌రాజు తెలిపారు.

విభజన హామీలు నెరవేర్చని మోదీని ఓడించాలి

- ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వలీ ఉల్లాఖాద్రీ

హిమాయత్‌నగర్ ఎస్ఎన్ రెడ్డి భవన్‌లో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

హిమాయత్‌నగర్, ఏప్రిల్ 1: తెలంగాణకు ఇచ్చిన విభజన హామీలను నెరవేర్చని మోదీ ప్రభుత్వాన్ని లోక్‌సభ ఎన్నికల్లో ఓడించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వలీ ఉల్లాఖాద్రీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర యువతకు పిలుపునిచ్చారు. బీజేపీ హటావో-దేశ్ బచావో వాల్ పోస్టర్‌ను సోమవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్ రెడ్డి భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 10 ఏండ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా మోసం చేసిందని ఆరోపించారు. దశాబ్ద కాలంలో నిరుద్యోగ సమస్య మరింత జఠిలమైందని పేర్కొన్నారు. మతోన్మాదాన్ని పెంచి పోషించడంతో పాటు కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కేంద్రం పనిచేసిందే తప్ప ప్రజలకు ఎలాంటి మేలు జరగలేదని అన్నారు.

పౌర హక్కులను కాలరాస్తూ సీబీఐ, ఈడీ వంటి సంస్థలను ఉపయోగించుకొని ఫెడరలిజం స్ఫూర్తిని మోదీ ప్రభుత్వం దెబ్బతిస్తున్నదని విమర్శించారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ చేసే రాజకీయాలను ఎండగట్టేందుకు యువత బలమైన ఉద్యమాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎన్.శ్రీకాంత్, నాయకులు శంకర్, శ్రీనివాస్, టి.సత్యప్రసాద్, మహేందర్, శ్రీమాన్, తదితరులు పాల్గొన్నారు.

'పింగళి'కి భారతరత్న ఇవ్వాలి

ముషీరాబాద్, ఏప్రిల్1: జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్యకు భారతరత్న అవార్డు ఇవ్వాలని టీపీసీసీ వ ర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం రాంనగర్‌గుండు వద్ద పిం గళి వెంకయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ పతాక 103 వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై... పిం గళి వెంకయ్య చిత్రపటానికి నివాళులర్పించి, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పింగళి వెంకయ్య చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కేహెచ్‌ఎస్ జగదాంబ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ శ్యామలారావు, సభ్యులు శ్రీకాంత్, అనుదీప్, వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు బాబురావు, సుబ్రహ్మణ్యం, వరదరాజు, కర్ణం సురేశ్, ఆనంద్, విజయ్ యాదవ్, నాగేంద్ర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

- శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు

శంషాబాద్‌లో పారిశుధ్య కార్మికులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ సుమన్‌రావు, తదితరులు

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 1: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు సూచించారు. శంషాబాద్ పట్టణంలోని మున్సిపల్ సిబ్బంది, పారిశుధ్య కార్మికులతో కలిసి ఓటు హక్కుపై మున్సిపల్ కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. 18 ఏండ్లు నిండిన వారు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటు హక్కు లేనివారు కొత్తగా నమోదు చేసుకోవాలని సూచించారు. అందరం కలిసి ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర, శానిటరి ఇన్‌స్పెక్టర్ లక్ష్మయ్య, పర్యావరణ ఇంజినీర్ అనిల్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

మారేడ్‌పల్లి, ఏప్రిల్ 1: వెస్ట్ మారేడ్‌పల్లి గీతాంజలి స్కూల్ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల ముగింపు కార్యక్రమం సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి వివిధ రంగాల్లో ప్రముఖులైన మహిళలను ఘనంగా సత్కరించారు. పాఠశాల ఆధ్వర్యంలో నెల రోజుల పాటు జరిగిన మహిళా వేడుకలు సోమవారంతో ముగి శాయి. ఈ ముగింపు వేడుకలకు నిజాంపేట మేయర్ నీలా గోపాల్‌రెడ్డి, సోషల్ యాక్టివిస్ ఇందుకూరి నిర్మలాదేవి, అలీఫ్ ఫౌండర్ ప్రెసిడెంట్ రమాదేవి, కార్పొరేటర్ కొంతం దీపిక, సర్వశిక్ష అభియాన్ మానిటరింగ్ హెడ్ డాక్టర్ కె. బాలకుమారి, ప్రముఖ ల్యాప్రోస్కోపిక్, కొలరెక్టర్ సర్జన్ డాక్టర్ శాంతి వర్ధని, క్లినికల్ సైకాలజిస్ట్ మాధవి, సోషల్ యాక్టివిస్ట్ మంజులత, కూచిపూడి నృత్య కళాకారిణి మృణాళిని తదితరులను సత్కరించి వారు సాధించిన విజయాలు, వాటిని చేరుకోవడంలో పడిన కష్టాలను విద్యార్థులకు వివరించారు.

ఈ సందర్భంగా పాఠశాల వ్యవస్థాపక చైర్మన్ శ్రీనివాసరావు, అకడమిక్ డైరెక్టర్ వేదకుమారిలు మాట్లాడుతూ.. వివిధ రంగాల్లో మహిళలు సాధించిన విజయాలను విద్యార్థులకు తెలియజేసేలా నెల రోజుల పాటు ప్రతి రోజూ ఓ ప్రముఖ మహిళ చేత విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి.

హరిహరకళాభవన్‌లో నిర్వహించిన వేడుకల్లో వివిధ రంగాల్లో రాణించిన మహిళలకు జ్ఞాపికలు అందజేసి సన్మానిస్తున్న పాఠశాల చైర్మన్ శ్రీనివాసరావు

బీసీలపై వ్యతిరేక వైఖరి మార్చుకోవాలి

- ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

కాచిగూడ, ఏప్రిల్ 1: మోదీ ప్రభుత్వం బీసీలపై వ్యతిరేక వైఖరి మార్చుకోవాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీ య అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. కేం ద్ర ప్రభుత్వం జనాభా దమాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని, అందుకు పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ చేయాలన్నారు. జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో సోమవారం కాచిగూడలోని అభినందన్ హోటల్‌లో బీసీ నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆర్.కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ.. 2021లో జనాభా లెక్కల్లో బీసీ కులాల వారిగా లెక్కలు సేకరించాలని సూచించారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి అసెంబ్లీ, చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జాతీయ బీసీ యువజన సంఘం అధ్యక్షుడు గవ్వల భరత్‌కుమార్, నీల వెంకటేశ్, నందగోపాల్, సుధాకర్, వేముల రామకృష్ణ, ఉదయ్, అనంతయ్య, రాజ్‌కుమార్, పృథ్వీగౌడ్, రాందేవ్‌మోదీ, లింగయ్య, నిఖిల్, రాణిరెడ్డి, సతీశ్, చంద్రశేఖర్, కమల్ పాల్గొన్నారు.

సనత్‌నగర్ జాయింట్ కన్వీనర్‌గా మహేశ్

అమీర్‌పేట్, ఏప్రిల్ 1: సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం బీజేపీ జాయింట్ కన్వీనర్‌గా సీనియర్ నాయకుడు ఆకుల మహేశ్ నియమితులయ్యారు. సనత్‌నగర్ బీకే గూడకు చెందిన ఆకుల మహేశ్ బీజేపీలో బూత్ స్థాయి నుంచి డివిజన్ యువమోర్చా, గ్రేటర్, రాష్ట్ర యువ మోర్చా కార్యవర్గ సభ్యుడిగా పనిచేశారు. అనంతరం సికింద్రాబాద్ మహంకాళి జిల్లా కార్యవర్గ సభ్యులుగా తన సేవలందిస్తున్న ఆకుల మహేష్‌ను సనత్‌నగర్ నియోజకవర్గానికి జాయింట్ కన్వీనర్‌గా నియమిస్తూ సోమవారం జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షులు బూర్గుల శ్యామ్‌సుందర్‌గౌడ్ నియామక పత్రాన్ని అందజేశారు. తన మీద నమ్మకంతో నియోజకవర్గం జాయింట్ కన్వీనర్‌గా బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షులు బూర్గుల శ్యామ్‌సుందర్‌గౌడ్‌కు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తదితరులకు మహేశ్ కృతజ్ఞతలు తెలిపారు.